క్లుప్తంగా

గెడ్డల్లో భారీగా వ్యర్థాలు



జీవీఎంసీ 26వ వార్డు చోటీబస్తీ వద్ద గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

సీతంపేట : నగరంలో గెడ్డల నిర్వహణ అధ్వానంగా తయారైంది. నెలలు తరబడి గెడ్డలు శుభ్రం చేయకపోవడంతో చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్ చోటీబస్తీ వద్ద గెడ్డలో భారీగా వ్యర్థాలు పేరుకుపోయాయి. చాలా కాలంగా గెడ్డను శుభ్రం చేయకుండా... అందులోని చెత్తను ఓ పక్కకు చేర్చి కేవలం మురుగునీరు ప్రవహించేందుకు మార్గం కల్పించారు. దీంతో వ్యర్థాల వల్ల పరిసర ప్రాంత ప్రజలు దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. చుట్టు పక్కల నివాసితులు తమ ఇళ్లలోని వ్యర్థాలను గెడ్డలో పడేస్తున్నారని... చెత్తను గెడ్డలో వేయకుండా మెస్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రహదారి ఆక్రమణతో ట్రాఫిక్ జామ్



శ్రీనగర్ రెడ్డి ఆస్పత్రి రోడ్‌లో ట్రాఫిక్ జామ్ వల్ల వెనుతిరుగుతున్న వాహన చోదకులు

సీతంపేట : రామాటాకీస్ సమీప శ్రీనగర్‌లో రెడ్డి హాస్పిటల్ రోడ్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మార్గంలో కార్లు, ద్విచక్ర వాహనాలు రోడ్డుకి రెండు వైపులా ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రహదారి ఇరుకుగా మారి ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే వీలులేక తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రామాటాకీస్ రోడ్ నుంచి వీటీ స్కూల్ మీదుగా ద్వారకానగర్ వెళ్లడానికి అనువైన రహదారి కావడంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం వేళల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి వాహనాల పార్కింగ్‌ను నియంత్రించి వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించేలా మార్గం సుగమం చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అబిద్‌నగర్, వేణుగోపాలస్వామి గుడి ఏరియా, రామచంద్రనగర్, కేవీ స్కూల్ ప్రాంతం, ఏఎస్ఆర్ నగర్ టిడ్కో గృహ సముదాయం, అన్నా క్యాంటీన్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

స్వచ్ఛ ఆంధ్ర జిల్లా నోడల్ అధికారిగా వెంకటరమణ



డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్ : ప్రభుత్వం ప్రతి మూడో శనివారం నిర్వహించనున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి పర్యవేక్షకులను రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ జి.గణేష్ కుమార్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు విశాఖపట్నం జిల్లా నోడల్ అధికారిగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణను నియమించారు. అనకాపల్లి జిల్లాకు అనకాపల్లి పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావును, ఏఎస్ఆర్ జిల్లాకు పాడేరు పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాతను నియమించారు. వీరు వారి జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమంగా తరలిస్తున్న యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నాటకకు చెందిన ముగ్గురు యువకులు అల్లూరి జిల్లా అరకులో కొనుగోలు చేసిన గంజాయిని బెంగళూరు తీసుకెళ్లే క్రమంలో రామాటాకీస్ సమీపంలో ట్రావెల్స్ బస్సుల వద్ద జరిపిన దాడుల్లో టాస్క్‌ఫోర్సు పోలీసులకు చిక్కారు. కర్నాటకకు చెందిన ప్రదీప్, అరుణ్‌కుమార్, పవన్‌కుమార్ నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ద్వారకా పోలీసులకు అప్పగించారు. సీఐ డీవీ రమణ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు.

- తగ్గిన రూ.10, రూ.20 నోట్ల చలామణి
- రైతుబజార్లలో వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు
- చిల్లర కొరతతో తప్పని తిప్పలు



చిన్న నోటు పెద్ద కష్టం





సీతమ్మధార రైతుబజార్

సీతమ్మధార : పది రూపాయల నోటు చిన్నదే అయినా ప్రతి ఒక్కరికీ చాలా అవసరం. ప్రస్తుతం మార్కెట్‌లో వాటి చలామణి తక్కువగా ఉండటంతో అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌బీఐ రూ.10 నోట్లు ముద్రణ నిలిపేసిందని సమాచారం. రోడ్డు పక్కన టీ స్టాల్‌లో టీ తాగాలన్నా.. పానీపూరీ తినాలన్నా, మార్కెట్లో కూరగాయలు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసి షాపు యజమానికి డబ్బులు చెల్లించడానికి, తిరిగి వారు చిల్లర ఇవ్వడానికి ఇటు ప్రజలు, అటు వ్యాపారస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్నాళ్లుగా రూ.10, రూ.20, రూ.50 నోట్ల లభ్యత తగ్గింది. దీంతో చిల్లర కష్టాలతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. చలామణిలో చిరిగిన, బాగా దెబ్బతిన్న రూ.10 నోట్లు తప్ప కొత్తవి రావడం లేదు. ప్రస్తుతం మార్కెట్లో చలామణిలో ఉన్న రూ.10 నోట్లు జేబులో పెట్టుకుంటే చిరిగిపోయే పరిస్థితులు ఉన్నాయి. నిరక్షరాస్యులైన వ్యాపారులు, సామాన్య ప్రజలు చిరిగిపోయిన పది నోట్లను తీసుకునేందుకు ఇష్టపడకపోవడంతో అన్ని వర్గాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 10 రూపాయల నాణెం ఉన్నా పెద్దగా చలామణిలో లేదు.

విశాఖ వాసులకు తప్పని ఇక్కట్లు

విశాఖ మహానగరంలో చిరు వ్యాపారులు, చిన్నపాటి హోటళ్లు, టీకొట్లు, ఆటోలు, బస్సుల్లో రూ.10 నోట్ల వినియోగం ఎక్కువగా ఉంటోంది. అందుకు తగిన విధంగా ఆ నోట్లు అందుబాటులో లేకపోవడం కష్టంగా ఉందని ప్రజలు చెబుతున్నారు. పట్టణంలో వివిధ రకాల వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. చాలా దుకాణాల్లో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా డబ్బులు చెల్లించే పద్ధతి ఉన్నా, సామాన్య ప్రజానీకం ఎక్కువగా వీధి వ్యాపారులు, రైతుల వద్ద కొనుగోలు చేసే కూరగాయలు, చిన్న చిన్న వస్తువుల కోసం చిల్లర సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో పలు చోట్ల రూ.100 నోటును ఇస్తే తిరిగి చిల్లర ఇచ్చేందుకు వ్యాపారులు నానా తంటాలు పడుతున్నారు. అయితే చిల్లర కష్టాలు దుకాణాలు, పాన్‌షాప్‌ల తోపాటు రైతుబజార్లలో ఎక్కువగా ఉంటోంది.

చిల్లర లేక అవస్థలు



రైతుబజార్లలో చిల్లర దొరక్క వినియోగదారులతోపాటు రైతులంతా అవస్థలు పడుతున్నాం. రూ.10 నోట్లు చలామణిలో కానరావడం లేదు. వచ్చినా చిరిగిపోయిన నోట్లు రావడంతో ఏం చేయాలో తెలియడం లేదు. రూ.20 నోట్లు కూడా తగ్గువగా ఉంటున్నాయి. ఫలితంగా వినియోగదారులు రూ.100, రూ.200 నోట్లు ఇవ్వడంతో చిల్లర ఇవ్వాలంటే కష్టంగా ఉంటుంది.

– రాము,సంతపాలెం, సీతమ్మధార రైతుబజార్

రూ.10 నోట్ల కొరతతో ఇబ్బందులు

యూపీఐ పేమెంట్లు చేసే అవకాశం లేనివారు, రూ.10 నోట్ల కొరతతో అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, విద్యార్థులు, నిరక్షరాస్యులు రూ.100, రూ.200, రూ.500 నోట్లను ఇస్తుంటారు. వారికి తిరిగి చిల్లర ఇవ్వడానికి తీవ్ర ఇబ్బందవుతోంది. రూ.10 నోట్లు కొరతతో పాటు చలామణిలో ఉన్నవి కూడా బాగా పాతవి, చిరిగినవి కావడంతో వాటిని తీసుకోవడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. రూ.10 నోట్లు కొత్తవి బ్యాంకుల ద్వారా విడుదల చేస్తే సమస్య పరిష్కారమౌతుంది.

– అప్పారావు, పాన్‌షాప్ వ్యాపారి, సీతమ్మధార,

కొనుగోళ్లకు ఇబ్బందులు

మార్కెట్లో పది రూపాయల నోట్ల కొరత తీవ్రంగా ఉంది. చలామణిలో ఉన్న పది రూపాయల నోట్లు కూడా బాగా చిరిగిపోయినవే ఉంటున్నాయి. రోజువారీ కొనుగోళ్లకు సంబంధించి పది రూపాయల నోట్ల అవసరం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా ఫుట్‌పాత్ వ్యాపారుల వద్ద కొనుగోళ్లకు చిన్న నోట్ల కొరత ఇబ్బందులు కలిగిస్తోంది. వారి వద్ద యూపీఐ పేమెంట్లకు అవకాశం ఉండదు.

– రాధ, నక్కవానిపాలెం

పుకార్లతో తిప్పలు



ఆర్‌బీఐ 2014 సంవత్సరంలోనే రూ.10 నాణేలు చలామణిలో దించింది. కానీ కొందరు పుట్టించిన పుకార్లనే ప్రజలు గుడ్డిగా నమ్మేసి రూ.10 నాణెం తీసుకోవడం మానేశారు. వాస్తవానికి నాణేలు చెల్లవని ఆర్‌బీఐ మీడియా ద్వారా ప్రకటనలు జారీ చేస్తుంది. అలాగే బ్యాంకుల ద్వారా మార్పిడి చేస్తుంది. కానీ ఆర్‌బీఐ ప్రకటన చేయకున్నా ప్రజలు పుకార్లు నమ్మేసి రూ.10 నాణెం తిరస్కరించడంతో గత 11 సంవత్సరాలుగా ప్రజల తిరస్కారానికి గురైన రూ.10 నాణేలు బ్యాంకుల్లో బస్తాలతో మూలుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఆర్టీసీ ఇటీవలే రూ.10 నాణెం చెల్లుతుందని ప్రకటించడంతో సమస్య గాడిలో పడుతుందని భావిస్తున్నారు. ఇక విశాఖలోని లీడ్‌బ్యాంకు మేనేజర్ కూడా ఈ విషయంలో తగిన శ్రద్ధ చూపకపోవడంతో ఈ బస్తాలకు మోక్షం కలగడం లేదని ఆందోళన వ్యక్తమవుతోంది.



వినియోగదారునికి చిల్లర ఇస్తున్న మహిళా రైతు

ఇప్పటికే కొంత మేరకు అన్ని వ్యాపార సంస్థల్లో డిజిటల్ చెల్లింపులు వినియోగంలో ఉన్నాయి. బస్సుల్లో ప్రయాణించేటప్పుడు యూపీఐ ద్వారా చెల్లింపులు చేయాలన్నా కొన్నిసార్లు కండక్టర్ వద్ద ఉండే ఆర్టీసీ యాప్ సక్రమంగా పనిచేయడం లేదని, ఆ సమయంలో చిల్లర సమస్య వేధిస్తోందని ప్రయాణికులు, కండక్టర్లు చెబుతున్నారు. పది రూపాయల నోట్ల కొరతతో కొందరు ముందు జాగ్రత్తగా ఆ నోట్లను భద్రపరుచుకుంటున్నారు. ఈ కారణంగా కూడా కొరత మరింత ఎక్కువవుతోంది. బ్యాంకుల ద్వారా రూ.10 నోట్లను ఎక్కువగా విడుదల చేసి చిల్లర కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు రూ.10 నాణేల వినియోగంలో ఇంకా ప్రజలు, వ్యాపారుల్లో ఉన్న అనుమానాలు, అపోహలను బ్యాంకు అధికారులు పోగొట్టి వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం కూడా ఉంది.

8న భీష్మ ఏకాదశి వేడుకలు



ఉత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న ఈవో రమాబాయి తదితరులు

సీతమ్మధార: దొండపర్తిలో గల శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 8, 9 తేదీల్లో భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జి.వి.రమాబాయి తెలిపారు. దేవస్థానంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 6 నుండి మర్నాడు ఉదయం 6 వరకు జరుగుతుందని తెలిపారు. ఆలయ ఆవరణలో సంకీర్తనలు, భక్తి గీతాలాపన జరుగుతాయన్నారు. అలాగే ఈ నెల 26వ తేదీన మహా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు. ప్రతినెల మూడవ గురువారం ఆలయంలో పేదలకు అన్న సంతర్పణ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు జి. శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ పితాని సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'ఒక ఊరి కథ'



మాట్లాడుతున్న పూర్ణా థియేటర్ అధినేత మంగరాజు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ నిర్వహిస్తున్న మూడు రోజుల ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం సాయంత్రం 1978లో మృణాల్ సేన్ దర్శకత్వంలో జాతీయ అవార్డు పొందిన 'ఒక ఊరి కథ' సినిమా ప్రదర్శించారు. మానవ సంబంధాల ఇతివృత్తంతో రూపొందిన తెలుగు సినిమా. తొలి టాకీ సినిమా దర్శకుడు హెచ్.ఎం.రెడ్డికి ఆర్థిక సహాయం చేసిన ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్, పూర్ణా పిక్చర్స్ అధినేత జి.ఎస్.మంగరాజు ముని మనుమడు చిత్రాలయ, మనోరమ, పూర్ణా థియేటర్ల అధినేత మంగరాజు (బాబ్జి) పాల్గొని అనుభవాలను వివరించారు. సమావేశంలో కృష్ణారావు, హుస్సేన్, ఆర్.కె.పాల్, చాట్ల బాబూరావు రెడ్డి, శారద, సుబ్బారావు, నరసింహారావు పాల్గొన్నారు.

ఐటీఐలో టెక్ కార్నర్ ఏర్పాటు



ఐటీఐకి మహేంద్ర సంస్థ అందించిన సామగ్రి

కంచరపాలెం : కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ (ఓల్డ్)లో టెక్ కార్నర్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ మేరకు ఐటీఐలోని డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రికల్ ట్రేడ్‌ల విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీతో విద్య అందించాలన్న ఉద్దేశంతో మహేంద్ర అండ్ మహేంద్ర సంస్థ సహకారంతో సెంటర్ ఫౌండేషన్ టెక్ కార్నర్‌ని రూపొందించినట్లు తెలిపారు. ఈ ల్యాబ్ నుంచి ఆన్‌లైన్ క్లాసులు వినవచ్చని సెంటర్ ఫౌండేషన్ ప్రతినిధి నవీన్ తెలిపారు. ఈ కంపెనీ ఐటీఐ విద్యార్థుల ట్రైనింగ్ కోసం స్మార్ట్ టీవీ, అత్యాధునిక టూల్ కిట్ అందజేసినట్లు తెలిపారు. సంస్థ అందిస్తున్న సేవలను ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.ఉమాశంకర్, ట్రైనింగ్ ఆఫీసర్ జె.సత్యనారాయణ, అధ్యాపకులు వి.శ్రీనివాసరావు, ట్రైనర్ జె.బాలమురళి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయిల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీఆర్‌ఏ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్‌రావు

సీతంపేట: ఉద్యోగుల పింఛను పథకం – 95 పేరిట కేంద్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడాల్సిందిపోయి, వారిని ఇబ్బందులకు గురి చేస్తోందని ఏపీఆర్‌ఏ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్‌రావు విచారం వ్యక్తం చేశారు. స్టీల్ అథారిటీ విశ్రాంత అధికారులు, ఉద్యోగుల సంక్షేమ సంఘం గురువారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎఫ్ ద్వారా లభించిన ధనంపై వచ్చే వడ్డీలో మూడో వంతు కేటాయించినా పింఛను పెంపు సాధ్యమవుతుందన్నారు. ఈ మేరకు ఈ నెల 11న ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద నిరసన సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. సంఘం అధ్యక్షుడు ఆడారి నాగరాజు మాట్లాడుతూ సెయిల్ విశ్రాంత ఉద్యోగులుగా అతి తక్కువ పింఛను, అరకొర వైద్య సేవలతో శేష జీవితాన్ని గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్రం తమ పట్ల అలసత్వం వీడి సత్వరమే సమస్యలు పర్కిరించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి అంద్రాజు నారాయణరావు మాట్లాడుతూ ఢిల్లీలోని తమ సంఘాల ద్వారా పోరాటం కొనసాగిస్తామన్నారు. 2012 నుంచి హెచ్ఆర్ఏ ఎరియర్స్, ఈపీఎస్ పింఛను వెయ్యి నుంచి రూ.9 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బొల్లా ప్రగడ సుబ్రహ్మణ్యం, సబ్బా విశ్వేశ్వరరావు, సి.వి.ధర్మారావు, పి.సీతారామారావు, ఎన్.రామలింగేశ్వరరావు, వై.జ్యోతి డి.ఆర్.రామమోహనరావు పాల్గొన్నారు.

మత్స్యకారుల మనోభావాలు దెబ్బతినేలా 'తండేల్' చిత్రం



మీడియాతో మాట్లాడుతున్న జానకిరామ్

సీతమ్మధార: ఉత్తరాంధ్ర మత్స్యకారుల జీవితాలను కథాంశంగా తీసుకుని నిర్మించిన 'తండేల్' సినిమా యదార్థ ఘటనలు వక్రీకరించి తీశారని ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ అన్నారు. ఈ మేరకు గురువారం జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ చిత్రం మత్స్యకారుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని విమర్శించారు. కాబట్టి ఈ నెల 7న చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో చిత్రం చూసి మరల ఏం చేయాలనే ఉద్దేశంతో మీడియా ముందుకు వస్తామని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా మత్స్యకారుల యదార్థ కథతో సినిమా తీస్తున్నాం అని ఎంతో గొప్పగా ప్రకటనలు చేస్తూ ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ పతాకంపై ఈ చిత్రం నిర్మించారన్నారు. పాకిస్తాన్‌లో చిక్కుకున్న వారిని విడుదల చేయించడంలో కృషి చేసిన వారిని ఈ సినిమాలో పూర్తిగా విస్మరించారని విచారం వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌లో చిక్కుకున్న శ్రీకాకుళం మత్స్యకారులను విడుదల చేయించే క్రమంలో తాము ఢిల్లీలోని పాకిస్తాన్ రాయబార కార్యాలయానికి పదే పదే తిరిగామని గుర్తు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కూడా కలిసి సమస్య వివరించామన్నారు. ఆయన చొరవతోనే సమస్య పరిష్కారం అయిందన్నారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు చిత్రానికి నిరసనగా ప్లకార్డులు ప్రదర్శించారు. బడే ఎల్లాజీ, కారి గురువులు, సురపతి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్‌పై హర్షం

మురళీనగర్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అధికారులకు, కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్‌ను గత ఏడాది కాలంగా నిలిపివేతపై ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఆప్రా) చేసిన పోరాటం ఫలించిందని ఆప్రా అధ్యక్షుడు కె.దీనబంధు, కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. హయ్యర్ పెన్షన్‌కు సంబంధించి స్టీల్‌ప్లాంట్ ట్రస్ట్ బైలాలో ఉన్న అనుకూల ప్రతిపాదనలను కేంద్ర ఉన్నతాధికారులకు, ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌పీఎఫ్‌వో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ ఇవ్వడానికి అంగీకరించడంపై హర్షం వ్యక్తం చేశారు. దీంతో ఆర్ఐఎన్ఎల్ పెన్షనర్ల పోరాటం ఫలించిందని చెప్పారు. 2014 ముందు ఉద్యోగులు, పింఛనుకు అర్హత పొందిన వారికి కూడా షరతులు లేకుండా హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని కోరారు.

శిథిలావస్థలో కాలువలు



సంకురపేటలో కాలువ పరిస్థితి ఇదీ

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ పరిధి సంకురపేటలో పలు వీధుల్లో కాలువలు శిథిలావస్థకు చేరాయి. మట్టి, రాళ్లతో కాలువలు కూరుకుపోవడంతో పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. కాలువల్లోని చెత్త తొలగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాలువలు శుభ్రంగా ఊడ్చకపోవడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారాయని, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సత్యారావు దంపతులు

సీతమ్మధార : జీవీఎస్ఎస్ఎస్ వరప్రసాద్ జ్ఞాపకార్థం అతని తల్లిదండ్రులు పదో తరగతి విద్యార్థులకు జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ మేరకు పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎన్ఎంహెచ్)లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ సమక్షంలో వరప్రసాద్ తండ్రి రిటైర్డ్ డీటీవో జె.సత్యారావు, తల్లి ఛాయాదేవి విద్యార్థులకు సామగ్రి అందజేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయకుమారి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనాత్మక జర్నలిజం కనుమరుగు



మాట్లాడుతున్న మిత్ర సాహితి వ్యవస్థాపకుడు ప్రసాదవర్మ

సీతంపేట : ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాల్లో జర్నలిజం నాల్గవదని, సమాజం ముందుకు సాగడానికి, రాజ్యాంగ పరిరక్షణకు, మనుగడకు జర్నలిజం పాత్ర కీలకమని మిత్ర సాహితి వ్యవస్థాపకుడు ప్రసాదవర్మ అన్నారు. మిత్ర సాహితి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 'జర్నలిజం వెలుగునీడలు' అంశంపై చర్చా కార్యక్రమం గురువారం నిర్వహించారు. సభాధ్యక్షత వహించిన ప్రసాదవర్మ మాట్లాడుతూ మీడియాలో అత్యాధునిక టెక్నాలజీతో వాస్తవాలతోపాటు, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. లీడర్ సంపాదకుడు వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ అప్పట్లో పరిశోధనాత్మక జర్నలిజం ఉండేదని, నేడు దాదాపు కనుమరుగైందన్నారు. కె.వి.కూర్మనాథ్ మాట్లాడుతూ సోషల్ మీడియా వచ్చాక ప్రతి ఒక్కరూ జర్నలిస్టుగా మారారన్నారు. ఏఐ వచ్చాక జర్నలిజంపై ప్రభావం చూపుతోందని, ఇప్పటికే ఆంగ్ల జర్నలిజాన్ని సునామీలా చుట్టేసిందన్నారు. త్వరలో తెలుగు జర్నలిజానికి ఏఐతో ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సోషల్ మీడియా ఒక ప్రజాస్వామిక సాధనమని, ఇందులో వెలుగు, నీడ ఉంటుందన్నారు. నరేంద్ర మోదీ వచ్చాక మీడియా రంగాన్ని తన గుప్పిట్లోకి తీసుకున్నారని, ఒక రకంగా కొనేశారన్నారు.

జోరుగా తాటి ముంజుల విక్రయాలు



రోడ్డు పక్కన విక్రయిస్తున్న తాటి ముంజులు

సీతమ్మధార : వేసవి నేస్తం తాటిముంజులు వచ్చేశాయి. ఉత్తర నియోజకవర్గం పరిధి 14వ వార్డులోని బాలయ్యశాస్త్రి లే అవుట్ వద్ద రోడ్డు మీద గురువారం నుంచి తాటిముంజులు విక్రయిస్తున్నారు. డజను ధర రూ.120 పలకడం విశేషం. విజయనగరం జిల్లా భోగాపురం, బూడపువలస, కుమిలి, విశాఖలోని తగరపువలస, ఆనందపురం, తదితర ప్రాంతాల నుంచి విశాఖ తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. రథసప్తమి తర్వాత విశాఖ నగరంలో ఎండలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో తాటి ముంజులు రావడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాటిముంజులు తినడం ద్వారా వేసవి తాపం తగ్గించవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రజలు ఈ తాటిముంజులను కొనగోలు చేయడానికి మక్కువ చూపుతున్నారు. ఎండలు పెరిగితే తాటిముంజుల విక్రయాలు మరింతగా పెరుగుతాయని భావిస్తున్నారు.

వసతి గృహానికి వృద్ధుడు

సీతమ్మధార: శ్రీకుమారి (54) పెదవాల్తేరు బస్ షెల్టర్ వద్ద తిరుగాడుతుండగా ఏయూటీడీ నిర్వాహకులు షెల్టర్ హోంకు తరలించారు. అలాగే జ్ఞానాపురం వద్ద సుమతి (55), గోపాలపట్నం వద్ద అన్నమ్మ (45) అనే మహిళలను గుర్తించి షెల్టర్ హోంకు తరలించారు. వీరి మానసిక పరిస్థితి బాగు లేదని గుర్తించి చినవాల్తేరులో గల ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స తీసుకున్న వీరంతా కోలుకున్నారు. దీంతో వీరిని గురువారం డిశ్చార్జి చేసి షెల్టర్ హోంకి తరలించారు.

సీతమ్మధార: భీమిలికి చెందిన దార అప్పారావు (75)కు ఇద్దరు పిల్లలు. వాళ్ల వివాహాలు చేసుకుని వేరేగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అప్పారావు భార్య కూడా అతన్ని వదిలేసి వెళ్లిపోవడంతో ఒంటరి వాడైన అప్పారావు వారం రోజులుగా ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉంటున్నాడు. ఏయూటీడీ సిబ్బంది ఇది గమనించి అప్పారావును షెల్టర్ హోంలో చేర్పించారు.